క్లుప్తంగా

18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి


జేసీ, ఆర్వో లావణ్యవేణి

పెదపాడు/దెందులూరు : పెదపాడు మండలంలోని వట్లూరులోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రం వద్దకు సిబ్బంది అంతా ఉదయం 6 గంటలకే తమ గుర్తింపు కార్డులతో చేరుకోవాలని దెందులూరు నియోజకవర్గ ఆర్వో, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. ఈనెల 4వ తేదీ ఉదయం 7 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించబడుతుందని చెప్పారు. దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గం, దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని పార్లమెంట్ సెగ్మెంట్ పరిధికి సంబంధించి 239 ఈవీఎంలను లెక్కించడానికి 14 ప్లస్ 14 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. లెక్కింపు ప్రక్రియ మొత్తం 18 రౌండ్లలో పూర్తవుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బందికి రెండో పర్యాయం శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్ హాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. సిబ్బంది ఎవరూ సెల్‌ఫోన్లు కౌంటింగ్ కేంద్రానికి తీసుకురాకూడదన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి వసతి సదుపాయం కల్పిస్తామని చెప్పారు.

సత్యవతి మృతికి సంతాపం

దెందులూరు: రోడ్డు ప్రమాదంలో శనివారం రాత్రి మృతి చెందిన యర్రా సత్యవతి భౌతికకాయాన్ని శ్రీరామవరం గ్రామంలో ఆమె నివాసంలో వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సహాయ సహకారాల అంశాన్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు, నాయకులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

భీమడోలు: సూరప్పగూడెం సబ్‌స్టేషన్ వద్ద ఈనెల 3వ తేదీ సోమవారం నూతనంగా ఏర్పాటు చేస్తున్న 33 కేవీ వీసీబీ నిర్మాణం నిమిత్తం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ జేపీబీ నటరాజన్ భీమడోలులో ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సూరప్పగూడెం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో భీమడోలు, సూరప్పగూడెం, పోలసానిపల్లి, గుండుగొలను, లింగంపాడు, కోరుకొల్లు, రత్నాపురం, భోగాపురం, వడ్డిగూడెం, లక్ష్మీపురం, ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆయన తెలిపారు.

ఘనంగా ముగిసిన గంగానమ్మ సంబరాలు

ఏలూరు రూరల్: శనివారపుపేట శ్రీరామ్‌నగర్ 9వ రోడ్డులో వేంచేసిన గంగానమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆఖరి రోజు ఆదివారం ఉదయం అమ్మవారిని ప్రత్యేక పూల, ఆభరణాలతో సుందరంగా అలంకరించి, వైభవంగా పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూలు, పండ్లు, గాజులు, చీరలు అమ్మవారికి సమర్పించుకుని తీర్థ, ప్రసాదం స్వీకరించారు. మహిళలు పిండి వంటలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ కమిటీ సభ్యులు ఆళ్ల మోహనరావు, గుత్తల ప్రసాద్, కొండపల్లి శ్రీనివాసు, శిరిగిబత్తిన శివనారాయణ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ 12వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఈ నెల 31న ప్రారంభమైన సంబరాల్లో భాగంగా 108 బిందెలతో అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమ పూజ, విశేష పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

రాట్నాలమ్మకు పూజలు


రాట్నాలమ్మ తల్లి

పెదవేగి : రాట్నాలకుంట గ్రామంలోని రాట్నాలమ్మ తల్లి ఆలయానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఘనంగా పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్లపై రూ.46, 325, విరాళాలపై రూ.7,261, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.16,455, ఫొటోల విక్రయంపై రూ.3,220, మొత్తం రూ.73,261 ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పెదవేగి : తన కుమార్తెకు మాయ మాటలు చెప్పి ఓ యువకుడు తీసుకెళ్లాడని బాలిక తల్లి కొమ్మూరి రమాదేవి ఆదివారం పోలీసులను ఆశ్రయించింది. పెదవేగి మండలం విజయరాయికి చెందిన బాలికను ఈనెల 1న ఓ దుకాణంలో ఉండగా అదే గ్రామానికి చెందిన యువకుడు తీసుకెళ్లాడని ఆమె తల్లి ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు.

గత మెజారిటీ కంటే అధికంగా ఓట్లు

- ఏజెంట్లు పోలింగ్ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి
- సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి దిశా నిర్దేశం


కొండలరావుపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్లకు దిశా నిర్దేశం చేస్తున్న అబ్బయ్యచౌదరి


కౌంటింగ్ విధానం, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు సరళిని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న అబ్బయ్యచౌదరి

పెదవేగి : గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీ కంటే అధికంగా ఓట్లతో రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఆదివారం రాయన్నపాలెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజవర్గంలో చీఫ్ ఏజెంట్లు ఏజెంట్లతో విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కార్యకర్త, నాయకుల కృషి తాను ఎన్నటికీ మరువనని, వారి కృషికి కచ్చితంగా గుర్తింపు గౌరవం ఉంటుందన్నారు. ఐదేళ్లపాటు నాయకులు కార్యకర్తల సమష్టి సేవలకు ఎన్నికల ఫలితాలు నిలువెత్తు నిదర్శనం అన్నారు. వైఎస్సార్‌సీపీ 120 స్థానాలకు పైగా విజయం సాధించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపడతారని చెప్పారు. ప్రతిపక్ష శ్రేణులు ఒక్కటై వస్తారని, మన ఏజెంట్లంతా పోలింగ్ ముగిసే వరకు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి రౌండ్ కౌంటింగ్‌ను నిశితంగా పరిశీలించాలన్నారు. తాగునీరు, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశామని, ఎటువంటి అనుమానం తలెత్తినా వెంటనే స్థానికంగా ఉన్న ముగ్గురు అధికారులతో పాటు రిటర్నింగ్ అధికారికి సమస్యను తెలియజేయాలన్నారు. 18 రౌండ్లు కౌంటింగ్ జరుగుతుందని, 15 రౌండ్లు కౌంటింగ్ ముగిసే సమయానికే వైఎస్సార్‌సీపీ దెందులూరు నియోజకవర్గం విజయఢంకా మోగిస్తుందన్నారు. రాబోయే కొద్ది గంటల్లో వాస్తవాలు ప్రపంచానికి రావడం తథ్యమన్నారు. దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు, ప్రజలు, కార్యకర్తలు, నాయకులకు తాను ఎన్నటికీ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కౌంటింగ్ రౌండ్లు, పోస్టర్ బ్యాలెట్ కౌంటింగ్ సరళిపై అవగాహన కల్పించారు. అనంతరం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సూచనలను తిలకించారు. సమావేశంలో నియోజకవర్గంలో చీఫ్ ఏజెంట్లు, ఏజెంట్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

సీతారామ దాసాంజనేయస్వామికి ఘనంగా గ్రామోత్సవం


ఏపూరులోని సీతారామ దాసాంజనేయస్వామికి గ్రామోత్సవం

పెదపాడు: ఏపూరులోని సీతారామ దాసాంజనేయ స్వామి జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం వరకు గ్రామంలో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి 7 గంటల నుంచి ఆలయం వద్ద భక్తి గీతాలాపన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దెందులూరు నియోజకవర్గానికి రాజకీయ ప్రాధాన్యత

- ఇప్పటి వరకూ నలుగురిని వరించిన మంత్రి పదవులు
- 2019 నుంచి వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి వెలుగు


సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ (ఫైల్)

దెందులూరు: దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గానికి 69 ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడ 1955 నుంచి ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కువ కాలం కాంగ్రెస్, టీడీపీ పార్టీలు పాలించాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కాంగ్రెస్ నుంచి ఉద్దండులు గెలిచినా మంత్రి పదవులు దక్కలేదు.

నలుగురుని వరించిన మంత్రి పదవులు

దెందులూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు నలుగురికి మంత్రి పదవులు దక్కాయి. 30 ఏళ్ల క్రితం 1983లో టీడీపీ తరపున ఎమ్మెల్యేగా పనిచేసిన గారపాటి సాంబశివరావుకు అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మంత్రిగా అవకాశం కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 1989లో మాగంటి రవీంద్రనాథ్ చౌదరికి అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర రెడ్డి దేవదాయ శాఖ మంత్రిగా అవకాశం కల్పించారు. రవీంద్రనాథ్ చౌదరి ప్రమాణ స్వీకారం చేస్తూ మృతి చెందారు. అనంతరం 1991లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన సతీమణి మాగంటి వరలక్ష్మిని దెందులూరు నియోజకవర్గ ఉప ఎన్నికల్లో పోటీ చేయించారు. వరలక్ష్మి ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా గెలిచారు. ఆమె అప్పటి ముఖ్యమంత్రి నేదురమల్లి జనార్ధన్‌రెడ్డి హయాంలో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. తదనంతరం వరలక్ష్మి మృతి చెందడంతో ఆయన కుమారుడు మాగంటి బాబుకు దెందులూరు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారు. మాగంటి బాబు ఎమ్మెల్యేగా గెలవడంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నీటిపారుదల శాఖ మంత్రిగా అవకాశం కల్పించారు.

యువతను ప్రోత్సహించిన సీఎం జగన్

రాజకీయాల్లో యువత భాగస్వామ్యంతోనే చురుకై న, ప్రణాళిక, సత్ఫలితాల సాధన నూరు శాతం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ యూకే కోఆర్డినేటర్‌గా ఉన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కొఠారు అబ్బయ్యచౌదరికి 2019లో అవకాశం కల్పించారు. నియోజకవర్గానికి టీడీపీ తరపున ఒకసారి ఎమ్మెల్యే, ఒకసారి విప్‌గా పనిచేసిన చింతమనేని ప్రభాకర్‌ను 17 వేలకుపైగా మెజార్టీతో ఓడించి ఎమ్మెల్యేగా అబ్బయ్యచౌదరి దెందులూరు పీఠాన్ని అధిరోహించారు.

నియోజకవర్గం నుంచి జెడ్పీ చైర్‌పర్సన్

వైఎస్సార్ కుటుంబ సన్నిహితుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు సతీమణి పెదపాడు జెడ్పీటీసీగా పద్మశ్రీ ఎన్నికయ్యారు. బీసీ మహిళ అయిన ఆమెకు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఇతర పార్టీ పెద్దల సహాయ సహకారాలతో ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ పదవి కేటాయించారు. ఇదే నియోజకవర్గానికి చెందిన ముంగర సంజీవ్‌కుమార్‌కు వడ్డీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ అవకాశం కల్పించారు. వివిధ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లుగా మండలి కొండలరావు, పల్లెం ప్రసాద్, ఎం.సూర్యనారాయణ, ప్రభాకరరావును నియమించారు.

అబ్బయ్యచౌదరి హయాంలో అభివృద్ధి పరుగు



దెందులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, నియోజకవర్గ ప్రజలందరి సహాయ సహకారంతో 2019 నుంచి 2024 వరకు ఐదేళ్లలో రూ.3,456 కోట్లతో నాలుగు మండలాల్లో నవరత్న పథకాల అమలుతో పాటు అభివృద్ధి, సంక్షేమం చేసి చూపించారు. 7 దశాబ్దాలుగా లక్షలాది మంది ప్రజలకు చిరకాల సమస్యగా ఉన్న బలివే వంతెన నిర్మాణం నియోజకవర్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు, ప్రధాన, లింకు రోడ్ల నిర్మాణం, కొల్లేరు అభివృద్ధి, 25 వేలకుపైగా ఇళ్ల స్థలాలు, ఎంజాయిమెంట్ సర్టిఫికెట్లు, రూ.2.74 కోట్లతో దెందులూరు సీహెచ్‌సీ అభివృద్ధి, కొల్లేరు అభివృద్ధితో పాటు అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశారు. లబ్ధిదారులకు ఇంటి వద్దకే పెన్షన్ అందజేత, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల వ్యవస్థ ద్వారా ప్రజలకు సత్వర సేవలందించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సాగుకు అవసరమైన అన్ని సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు.

వేసవి తాపం నుంచి ఉపశమనం


గణపవరంలో మబ్బుతో నిండి, చల్లబడిన వాతావరణం

గణపవరం: రోహిణీ కార్తె ప్రభావంతో వారం రోజు లుగా విపరీతమై ఎండ తీవ్రత, వడగాల్పులతో అల్లాడిన ప్రజలకు ఆదివారం ఉపశమనం లభించింది. ఆదివారం ఉద యం నుంచి సూర్యుడు కనపడకుండా వాతావరణం పూర్తిగా మేఘావృత్తమై ఉంది. మూడు రోజులు గురు, శుక్ర, శని వారాల్లో ప్రజలు ప్రచండ సూర్యుడు ధాటికి వెలువడిన వేడి సెగలు తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దీనికి తోడు కొల్లేరులో కిక్కిస గడ్డి తగలబెట్టడంతో తీర ప్రాంతాలైన గణపవరం, నిడమర్రు, ఉండి, ఆకివీడు, ఉంగుటూరు, భీమడోలు మండలాల ప్రజలు ఆపసోపాలు పడ్డారు. మధ్యాహ్నానికి గాలి పూర్తిగా స్తంభించి ఊపిరాడని పరిస్థితిని ఎదుర్కొన్నారు. మూడు రోజులూ ఫ్యాన్లు, ఏసీలు వదిలి బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఉదయం 7 గంటలకు మొదలైన ఉక్కబోత, వేడి తీవ్రత రాత్రి 8 గంటల వరకూ కొనసాగి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అలాంటి పరిస్థితికి పూర్తి భిన్నంగా ఆదివారం వాతావరణం పూర్తిగా చల్లబడి ప్రజలంతా వేసవితాపం నుంచి ఉపశమనం పొందారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల కృషి మరువలేనిది


కొండలరావుపాలెంలో అబ్బయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరిస్తున్న నాయకులు

పెదవేగి : ఇటీవల పూర్తయిన ఎన్నికల్లో ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త స్వచ్ఛందంగా పార్టీ కోసం ఎంతో కృషి చేశారని, వాళ్లందరి సేవలు మరువలేనివని దెందులూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో అబ్బయ్యచౌదరిని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. దెందులూరు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వందలాది మంది నాయకులు కార్యకర్తలు ఆదివారం రాత్రి కొండలరావుపాలెంలోని కార్యాలయంలో అబ్బయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు. గ్రామాల్లో పోలింగ్ సరళిని అబ్బయ్యచౌదరికి వివరించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం విశేష కృషి చేసిన ప్రతి ఒక్కరి సేవలను గుర్తు ఉంచుకుని వారికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి అందించి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పెద్దలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి ఘన స్వాగతం


గన్నవరం ఎయిర్‌పోర్టులో అబ్బయ్యచౌదరికి ఘన స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


ఎయిర్‌పోర్టులో జానంపేట బాబు, మేడికొండ కృష్ణారావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి విదేశీ పర్యటన ముగించుకుని ఆదివారం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి బయటకు రాగానే దెందులూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులందరినీ ఎమ్మెల్యే పేరు పేరునా పలకరించారు. వైఎస్సార్‌సీపీ పార్టీ మండలాల అధ్యక్షుడు జానంపేట బాబు, కామిరెడ్డి నాని, తేరా ఆనంద్, కార్పొరేషన్ డైరెక్టర్ మండలి కొండలరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, జిల్లా కార్యదర్శి గొల్లా వీరాస్వామి, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, సర్పంచులు ప్రభుదేవా, రఘు, సొసైటీ చైర్మన్ చల్లగోళ్ల భూస్వామి, పాకలపాటి శ్రీనివాసరావు, నాయకులు మేడికొండ కృష్ణారావు, గుంపు ఇస్రాయేలు, బళ్ల విజయ్‌కుమార్, నాలుగు మండలాల్లో నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతుల్లేవు


పి.శ్రీనివాసకుమార్, పెదవేగి సీఐ

దెందులూరు: ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో విజయోత్సవ ర్యాలీలకు, సభలకు, సమావేశాలకు ఎటువంటి అనుమతి లేదని పెదవేగి సీఐ పి. శ్రీనివాసకుమార్ అన్నారు. ఆదివారం దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సెక్షన్ 30, సెక్షన్ 144 అమలులో ఉన్నందున ఏ ప్రాంతంలోనైనా ఇద్దరు, ముగ్గురుకి మించి గుమ్మిగూడి ఉండరాదన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై పూర్తిస్థాయి నిఘా ఉందన్నారు. ఎన్నికల నిబంధనలు అనుసరించి అన్ని రాజకీయ పార్టీలు సోషల్ మీడియాలో వదంతులను ప్రచారం చేయడం, ఎదుటివారిని రెచ్చగొట్టేలా పోస్టింగులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ రోజున పోలింగ్‌కు ముందు హింసాత్మక సంఘటనలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు బైండోవర్లు చేసి రౌడీషీట్లు ఓపెన్ చేశామన్నారు. 4వ తేదీన కౌంటింగ్ రోజున ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడితే వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేసి వారి పేర్లు ఎన్నికల నేరస్తుల జాబితాలో చేర్చుతామని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు వారి కార్యకర్తలు, అభిమానులను అదుపులో ఉంచుకోవాలని శాంతిభద్రతల పరిరక్షణను పోలీసులకు సహకరించాలని సీఐ శ్రీనివాసకుమార్ కోరారు.

వీరాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం


పెదపాడులోని వీరాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ

పెదపాడు: పెదపాడులోని వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి తమలపాకులతో, మల్లెలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయంత్యుత్సవాల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి కొయ్యాన తేజేష్‌కు ఆలయ కమిటీ తరుపున రెడ్డి సతీష్‌కుమార్ రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తుమరాడ కనకారావు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, అర్నిపల్లి రామకృష్ణ, జీ సింహాచలం పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి - కేసు నమోదు

దెందులూరు: రామారావుగూడెం పంచాయతీ మలకచర్లలో ఫీల్డ్ అసిస్టెంట్ కె.వెంకటరమణపై దాడి చేసిన ఉపాధి హామీ కార్మికుడు శ్రీను కూలి పనులు రెండు వారాల పాటు నిలుపుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని జాతీయ ఉపాధి హామీ పథకం దెందులూరు ఏపీఓ దశరథ రామ్‌జీ అన్నారు. ఆదివారం దెందులూరు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూలీని వివరణ కోరగా స్పందించలేదని సోమ వారం 10 గంటల లోపు కార్యాలయానికి రాకపోతే రెండు వారాల పాటు ఆయనకు పనులు నిలుపుదల చేస్తామని ఏపీఓ అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడికి సంబంధించి దెందులూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని ఆయన అన్నారు.

దివ్యాంగులకు సేవలు ప్రశంసనీయం


దివ్యాంగులకు నిత్యవసరాలు, పండ్లు, పోషకాహారాన్ని అందిస్తున్న దాతలు, వైద్యులు

భీమడోలు: విఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి కేంద్రంగా దివ్యాంగులకు అందిస్తున్న సాయం ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. గుండుగొలనులో ఆదివారం విఘ్నేశ్వర దివ్యాంగుల సేంవా సమితి భవనంలో దాతల ఆర్థిక సాయంతో 55 మంది దివ్యాంగులకు నెలవారీ వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మామిళ్లపల్లి ఆదినారాయణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సన్న బియ్యం, మామిడి పండ్లు, పోషకాహారాన్ని అందించారు. అనంతరం ఏలూరుకు చెందిన లైఫ్ ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ హరికిషన్, డాక్టర్ గీతిక పాల్గొని ఆరోగ్య సంబంధమైన సూచనలు, సలహాలను అందించారు. వైద్యులను దాతలు ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో దాతలు ఎం.రామకృష్ణ, హనుమ, వంగపండు సతీష్, పెద్దలు పేరిచర్ల శ్యామలరాజు, కేశవరాజు, గేదెల శ్రీను, ఆరసంకల సోములు, రావి గంగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న స్పెషల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్సై కె.స్వామి

దెందులూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, ప్రజాజీవనానికి భంగం కలిగించే విధంగా రౌడీషీటర్లు ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. ఆదివారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ డి.మేరి ప్రశాంతి, నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య, పెదవేగి సీఐ పీ.శ్రీనివాసకుమార్ ఆదేశాలతో ఎస్సై కే.స్వామి రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. స్పెషల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రౌడీషీటర్లు వారి ఆలోచనా విధానాన్ని మార్చుకుని వారి కుటుంబం, అభివృద్ధి కోసం పని చేయాలన్నారు.రౌడీషీటర్లు వారి దైనందిత జీవన విధానంపై ఎస్సైను అడిగి తెలుసుకున్నారు. వివాదాలు, అల్లర్లు సృష్టించినా, సహకరించినా, జైలుకు వెళ్లడం ఖాయమని ఎస్సై స్వామి అన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు


భీమడోలులో యోగా సాధన చేస్తున్న చిన్నారులు

భీమడోలు: భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరం శిక్షణ తరగతులు ఉత్సాహభరిత వాతావరణంగా సాగుతున్నాయి. ఆదివారం గ్రంథాలయాల్లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల్లో బాలబాలికలు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేసి పుస్తక సమీక్షలు రాశారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు టీవీ ఉమామహేశ్వరరావు, మండే సుధాకర్ చిన్నారులకు పలు అంశాలను నేర్పించారు. ఈనెల 7వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ శిక్షణ తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకులు కోరారు. తొలుత చిన్నారులచే ప్రతిజ్ఞ చేయించారు. చిన్నారులంతా యోగాసనాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.